teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 232 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 26 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## వైద్య విద్యలో నియామకాల జోరు

Medical and Health Services Recruitment Board

607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్

అభ్యర్థుల ప్రాథమిక జాబితా విడుదల

అభ్యంతరాలకు అవకాశం

05

## తిరుమల భక్తులకు హెచ్చరిక

### నకిలీ వెబ్‌సైట్లతో ముప్పు

టీటీడీ పేరిట ఆన్‌లైన్ మోసాలు

దర్శన టికెట్లు, గదుల కేటాయింపుల్లో దందా



02




## ఎన్‌సీఈఆర్టీ పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు సీరియస్

### న్యాయవ్యవస్థలో అవినీతి సెక్షన్ తొలగింపు

న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం



ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్యాంశంపై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్రం చర్యలకు సిద్ధమైంది. సిలబస్ రూపొందించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. ఇలాంటి సిలబస్‌తో పిల్లలపై చెడు ప్రభావం పడుతుందని కేంద్రం పేర్కొంది. కాగా, సుప్రీం వార్నింగ్‌తో ఎన్సీఈఆర్టీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

2

## సింగరేణి చెంతకు బ్రెజిల్

"లిథియం మైనింగ్ ప్రతిపాదన"

సీబీఎల్ సంస్థతో కీలక భేటీ

.. వివరాలు 2లో




## ఇంధన రంగంలో నూతన నిబంధనలు

"ఆర్ఓఎన్ 95 ప్రమాణాలు"

కేంద్ర ప్రభుత్వ కీలక నిర్ణయం

ఏప్రిల్ 1 నుంచి మిశ్రమ పెట్రోల్ తప్పనిసరి

.. వివరాలు 2లో



## శాంతిభద్రతల వైఫల్యంపై డీజీపీకి బీజేపీ ఫిర్యాదు

రాష్ట్ర ప్రభుత్వంపై రామచంద్రరావు నిప్పులు

.. వివరాలు 2లో

## చిన్నారి హత్యపై కేటీఆర్ ఆగ్రహం



- ఘటనపై బాధిత కుటుంబంతో కలిసి దీక్ష
- పసిపాప ప్రాణం తీయడంపై కేటీఆర్ ఆవేదన
- పోలీసుల తీరుపై విమర్శలు
- హంతకులను కాపాడుతున్నారని ఆరోపణ

02

## భారతీయ రైల్వేలో సరికొత్త విప్లవం

"రైల్ పార్సిల్ యాప్ ప్రారంభం"

ఇంటి వద్దకే రైల్వే పార్సిల్ సేవలు

పైలట్ ప్రాజెక్టుగా శ్రీకారం




సికింద్రాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): భారతీయ రైల్వేలో పార్సిల్ యాప్‌తో సరికొత్త అధ్యాయానికి దక్షిణ మధ్య రైల్వే శ్రీకారం చుట్టింది. రైల్వే వినియోగదారులకు

మిగతా 5 లో





## సైబర్ నేరాలపై పోలీసుల ఆపరేషన్ క్రాక్‌డౌన్

- మ్యూల్ బ్యాంక్ ఖాతాలే లక్ష్యంగా భారీ దాడులు
- 16 జిల్లాల్లో ఏకకాలంలో సోదాలు

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పోలీసులు ఆపరేషన్ క్రాక్‌డౌన్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2 లో

## కాళేశ్వరం నివేదికపై హైకోర్టులో వాడీవేడి వాదనలు



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై విచారణ

కమిషన్ పరిధి దాటి వ్యవహరించింది

హరీశ్ రావు తరఫు న్యాయవాది వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై బుధవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ నివేదికను రద్దు చేయాలంటూ గతంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు, ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ ఎస్కే జోషి పిటిషన్లు దాఖలు

మిగతా 2 లో

## పీఎం ఆవాస్ యోజన 2.0 కింద నిధులు




- "రూ. 2.88 లక్షల ఇళ్ల మంజూరు"
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలకు లబ్ధి

05

## తెలంగాణ పల్లెల్లో డిజిటల్ విప్లవం




టీ-ఫైబర్‌కు కేంద్రం నుంచి రూ. 3,185 కోట్ల ఆర్థిక చేయూత

మూడు జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యత

05

## రెవెన్యూ వ్యవస్థలో మౌలిక విప్లవం

### అద్దె భవనాలకు స్వస్తి


తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు

రెండు దశల్లో భారీ నిర్మాణ ప్రణాళికలు



05

# ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశంపై
# "సుప్రీంకోర్టు సీరియస్"






న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): ఎన్సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్యాంశంపై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్రం చర్యలకు సిద్ధమైంది. సిలబస్ రూపొందించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. ఇలాంటి సిలబస్‌తో పిల్లలపై చెడు ప్రభావం పడుతుందని కేంద్రం పేర్కొంది. కాగా, సుప్రీం వార్నింగ్‌తో ఎన్సీఈఆర్టీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. న్యాయవ్యవస్థలో అవినీతి అనే సెక్షన్‌ను ఎనిమిదో తరగతి పాఠ్యాంశం నుంచి ఎన్సీఈఆర్టీ తొలగించనుంది. న్యాయవ్యవస్థపై ప్రతికూల అంశాల కంటే, స్ఫూర్తిదాయక అంశాలు రాయాలని కేంద్ర ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయ వ్యవస్థలో అవినీతి అనే పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. న్యాయ వ్యవస్థను కించపరిచే ప్రయత్నాలను సహించమంటూ ఆయన హెచ్చరించారు. ఈ అంశంపై తగ్గిన చర్యలు తీసుకుంటామని సీజేఐ వెల్లడించారు. న్యాయవ్యవస్థకు ఉన్న అతిపెద్ద సవాళ్లు అవినీతి, న్యాయమూర్తుల ఖాళీలంటూ ఎన్సీఈఆర్టీ ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకం పేర్కొంది. న్యాయ వ్యవస్థను అవినీతి మయమని పేర్కొనడం ఆందోళనకరమంటూ సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాన్ని సుమోటో కేసుగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవ్యవస్థను కించపరిచేందుకు ఉద్దేశపూర్వకంగా చేశారని, తీవ్రంగా పరిగణిస్తున్నానని తగిన చర్యలు తీసుకుంటామని సీజేఐ తెలిపారు.

## కాళేశ్వరం నివేదికపై
## "హైకోర్టులో వాడీవేడి వాదనలు"

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ జరిగింది. విచారణ సందర్భంగా హరీశ్‌రావు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పరిధి దాటి వ్యవహరించిందని, కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం ప్రకారం పీసీ ఘోష్ నివేదిక చెల్లదన్నారు. మేడిగడ్డ పిల్లర్ కుంగిపోతే ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. ఏం జరిగిందో నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత మాత్రమే కమిషన్‌పై ఉంటుందని వాదించారు. కమిషన్ తన పరిధి దాటి నివేదిక ఇచ్చిందని అందువల్ల జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదని వాదించారు. సుందరం వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. రేపు కేసీఆర్ తరఫున న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపించనున్నారు.

## సైబర్ నేరాలపై పోలీసుల
## ఆపరేషన్ క్రాక్‌డౌన్"

మొదటి పేజీ తరువాయి



సైబర్ క్రైమ్‌పై 16 జిల్లాల్లో ఒకేసారి ఈ భారీ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మ్యూల్ బ్యాంక్ ఖాతాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫోకస్ పెట్టారు. 2025లో రాష్ట్రంలో 4,775 మ్యూల్ అకౌంట్లు ఉన్నట్లు గుర్తించారు. బుధవారం జరిపిన ఆపరేషన్‌లో 1,888 అనుమానాస్పద ఖాతాలకు సైబర్ సెక్యూరిటీ అధికారులు బ్యూరో చెక్ పెట్టారు. ఈ క్రమంలోనే 137 బ్యాంక్ బ్రాంచ్‌ల్లో సోదాలు చేశారు. దేశవ్యాప్తంగా 9,431 క్రైమ్ లింకులు ఉన్నట్లు వెల్లడించారు. తెలంగాణలోనే 782 కేసులతో మ్యూల్ అకౌంట్లకు ఈ సంబంధం ఉందని వివరించారు. 137 పోలీస్ టీమ్స్ 512 మంది సిబ్బందితో ఈ సోదాలు నిర్వహించారు. కొన్ని బ్రాంచ్‌ల్లో వందల సంఖ్యలో మ్యూల్ ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. సుల్తాన్ బజార్‌లో ఒకే అకౌంట్‌కు 496 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సూర్యాపేటలో 4 బ్రాంచ్‌లలో 298 అనుమానాస్పద ఖాతాలు, చిన్న బ్యాంకులు ఆర్టీజీఎస్ కోసం నేషనల్ బ్యాంకుల సిస్టమ్ వినియోగించినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. సరైన వెరిఫికేషన్ లేకపోవడంతో సైబర్ నేరగాళ్ల మ్యూల్ అకౌంట్స్‌తో దందాలకు పాల్పడుతున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు పేర్కొన్నారు.

## ఇంధన రంగంలో నూతన నిబంధనలు




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విక్రయించే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ ఇంధనం కనీసం 95 రీసెర్చ్ ఆక్టేన్ నంబర్ (ఆర్ఓఎన్) కలిగి ఉండాలని తెలిపింది. ఆర్ఓఎన్ అనేది వాహన ఇంజిన్ లోపల ఒత్తిడిని పెట్రోల్ ఎంత సమర్థవంతంగా నిర్వహించగలదో చూపించే సంఖ్య. ఇంజిన్ లోపల ఇంధనం అసమానంగా మండినప్పుడు, అది నాకింగ్ శబ్దాన్ని సృష్టిస్తుంది. దీన్ని ఇంజిన్ నాకింగ్ అంటారు. ఈ నాకింగ్ కాలక్రమేణా ఇంజిన్‌ను దెబ్బతీస్తుంది. ఆర్ఓఎన్ ఎంత ఎక్కువగా ఉంటే, ఇంధనం నాకింగ్‌ను అంత బాగా తట్టుకుంటుంది. సహజంగా, ఇథనాల్ అధిక ఆక్టేన్ విలువ(సుమారు 108 ఆర్ఓఎన్) ను కలిగి ఉంటుంది. కాబట్టి పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ వల్ల ఇంజిన్ నాకింగ్‌ను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. చమురు కంపెనీలు ఈ నియమాలను పాటించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం పరిమిత సమయం వరకు ప్రత్యేక పరిస్థితుల్లో, కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక మినహాయింపును ఇచ్చింది. ఈ మేరకు చమురు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల ప్రకారం, దేశవ్యాప్తంగా 20 శాతం వరకు ఇథనాల్ మిశ్రమం, కనీసం ఆర్ఓఎన్95 కలిగిన పెట్రోల్‌ను మాత్రమే చమురు సంస్థలు విక్రయించాలి.

## రెవెన్యూ వ్యవస్థలో మౌలిక విప్లవం
# "అద్దె భవనాలకు స్వస్తి"

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహశీల్దార్ కార్యాలయాలు, ఐదు ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. రెండో విడతలో శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. బుధవారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి? శిథిలావస్థలో పాలనకు అనువుగా లేని భవనాల వివరాలను సేకరించారు.

ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడం, చాలా వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని మంత్రి విమర్శించారు. కొన్ని మండలాలు రెండు, మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మండిపడ్డారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామన్నారు. అలాగే ప్రజలకు దూరంగా కలెక్టరేట్లను నిర్మించి నిర్వహణను గాలికి వదిలేశారని విమర్శించారు.



### రిజిస్ట్రేషన్ల శాఖకు అన్ని వసతులు

రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పటాన్ చెరులో భవనాలకు శంకుస్థాపన పూర్తయిందన్నారు. గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, మరికొద్ది నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతుందన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.



## తిరుమల భక్తులకు హెచ్చరిక

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): తిరుమలలో నకిలీ వెబ్ సైట్లు కలకలం సృష్టించాయి. దర్శన టికెట్లు, గదుల కేటాయింపుల పేరుతో భక్తుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. దీంతో టీటీడీ అప్రమత్తమైంది. టీటీడీని పోలిన నకిలీ వెబ్ సైట్లను గుర్తించింది. గతంలోనూ 40 నకిలీ వెబ్ సైట్లపై పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేశారు. అయినా సరే మళ్లీ నకిలీ వెబ్‌సైట్లు చెలరేగిపోయాయి. దీంతో ఈ నకిలీ వెబ్ సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులకు టీటీడీ అధికారులు సూచించారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారానే భక్తులు సేవా టికెట్లు పొందాలని స్పష్టం చేశారు. భక్తులను మోసం చేస్తున్న నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

## చిన్నారి హత్యపై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్ , ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో హత్యారాజకీయాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి ప్రాణాలు తీయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బాధిత కుటుంబం చేపట్టిన దీక్షలో కేటీఆర్ పాల్గొన్నారు. వారికి తన మద్దతు తెలిపి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రెండునెలల పసిగుడ్డు ఏం పాపం చేసిందని, ఏం అడిగిందని పొట్టనపెట్టుకున్నారని ప్రశ్నించారు. మాటలకు, ఊహలకు అందని మహావిషాదమని, కుమ్మెర జాతరలో జరిగిన ఘటనకు తెలంగాణ సమాజమే తలదించుకోవాలన్నారు. మానవత్వానికి మాయని మచ్చ ఇది అని, దీనిపై రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకూ పోరాడుతామని తెలిపారు. పసిపాప ప్రాణాలను బలిగొన్న హంతకులకు ఎవరూ అండగా నిలబడవద్దని విజ్ఞప్తి చేశారు. చిన్నారి, తల్లిదండ్రులపై ఇష్టానుసారంగా దాడిచేసి, కులంపేరుతో దూషించిన మానవ మృగాలను శిక్షించాలని డిమాండ్ చేశారు.

### కోటిరూపాయల పరిహారం

ఈ ఘటనలో పోలీసులు బాధిత కుటుంబానికి అండగా నిలవకపోవడం హేయమైన చర్య అన్నారు. హంతకులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నించడం ఆ వ్యవస్థకే సిగ్గుచేటని విమర్శించారు. మనం ఎంత అభివృద్ధి చెందిన సమాజంలో ఉన్నా నేటికీ కులంపేరుతో దాడులు చేస్తుండటం దారుణమన్నారు. ఆ రెండేళ్ల చిన్నారికి కులం తెలుసా? మతం తెలుసా? ఏం తెలుసని నిండు జీవితాన్ని చిదిమేశారంటూ ఫైరయ్యారు. హంతకుడు ఏ పార్టీకి చెందినవాడైనా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, చిన్నారి మరణానికి కారణమైన 8 మందినీ వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సింగరేణి చెంతకు బ్రెజిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): తాము చేపట్టిన లిథియం మైనింగ్ లో సింగరేణి సంస్థ భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్ దేశానికి చెందిన ప్రముఖ సీబీఎల్ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసి వివరాలను తెలిపింది. సీబీఎల్ (కంపాన్హియా బ్రసిలీరా డి లిటియో) బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమే, సీఈవో వినీసియస్ అల్వారెంగా తమ కంపెనీ ఏవిధమైన పనులు చేపడుతుందని తెలిపారు. బ్రెజిల్ దేశంలో ఇప్పటికే తాము లిథియం మైనింగ్ చేపట్టామని, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల పట్ల ఆసక్తితో ఉన్న నేపథ్యంలో తమ కంపెనీలో భాగస్వామిగా చేరినట్లయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు వివరించారు. తాము సింగరేణితో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీలను కూడా సంప్రదిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం ప్రపంచంలో లిథియం కీలక ఖనిజానికి ఉన్న ప్రాధాన్యత, వ్యాపార కోణంలో ఉన్న లాభదాయకత గురించి వివరించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన వివరాలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ గౌతమ్ పోట్రు చెప్పారు. బ్రెజిల్ దేశంలో కీలక ఖనిజ అవకాశాలను, లాభదాయకత తదితర అంశాలను తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## శాంతిభద్రతల వైఫల్యంపై
## "డీజీపీకి బీజేపీ ఫిర్యాదు"

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు. పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ యువకులను వెంటనే విడుదల చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు.

## బంజారాల సంక్షేమం కోసం

# ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

**అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలి**

**సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంను అనుసరించాలి**

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని బంజారా కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుదవారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ గుడి హరిత హోటల్ పక్కన తెలంగాణ ప్రభుత్వం సద్గురుసంత్

శ్రీ సేవాలాల్ మహారాజ్ గారి ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమం అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, బంజారా కులస్తులు భవన నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో ప్రభుత్వం వారి సంక్షేమం కోసం వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. సమావేశానికి ముందు సీతక్క బంజారా భాషలో మాట్లాడి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటుపడాలని, మనం ఏం చేయాలన్న వారి స్ఫూర్తి తీసుకొవాలన్నారు. జిల్లాలో గిరిజన అధికారులు సామాజిక అభివృద్ధి అంశాలలో చొరవ తీసుకోవాలని, సంత్ సేవాలాల్ చూపిన ఆశయాలను అందరి సహకారంతో సాధించాలని, గిరిజన జాతి అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. ముందుగా ములుగు బంజారాల కుల పెద్ద పోరిక గోవింద్ నాయక్ మాట్లాడుతూ బంజారాలకు మద్దిమడుగు లో 20 ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం కోసం కేటాయించినందుకు, ములుగు జిల్లా గట్టమ్మ వద్ద సుమారు 20 గుంటల స్థలం, ఆలయ నిర్మాణం కోసం పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపినందుకు ములుగు జిల్లా బంజరాల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పోరిక గోవింద్ నాయక్, పూజారులు రమేష్ గిరి మహారాజ్, కిషన్ మహారాజ్, ఐటిడిఏ అధికారి జనార్ధన్, రాహుల్, బంజారా కులస్తులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు వివిధ శాఖలు తీసుకుంటున్న చర్యల గురించి శాఖల వారీగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వీలైనంత ఎక్కువగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిర్వహించే సమావేశాల్లోను మత్తు పదార్థాల వాటిల్లే అనర్థాలపై అవగాహన కల్పించాలని డీఈవో కు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో నెలలో ఒకరోజులో కొంత సమయాన్ని మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవిధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. హాస్టల్స్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు.

గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారి సమాచారాన్ని అందజేయాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, డీఈవో ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, ఎన్సీడీపీఓ డాక్టర్ శ్రీనివాస్, డీ డబ్ల్యు ఓ విశ్వజ, కేఎంసీ నుండి డాక్టర్ సంధ్య, డాక్టర్ అనిత రెడ్డి, ఎన్ఐ టీ , కేయూ, ఎస్సార్ యూనివర్సిటీలతోపాటు కిట్స్, వివిధ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

**అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల, పాల్వంచ లోని పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును సమగ్రంగా పరిశీలించారు. ప్రశ్నాపత్రాల భద్రతా పంపిణీ విధానం, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, ఇన్విజిలేషన్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించి, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. జనరల్, వొకేషనల్ విభాగాలు కలిపి మొత్తం 9,685 విద్యార్థులు ఉండగా , అందులో 9,210 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 7,973 మందికి విద్యార్థులు ఉండగా , 7,683 మంది హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,712 మంది ఉండగా, 1,527 మంది హాజరయ్యారు. మొత్తం 475 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అన్ని మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. తదుపరి రోజుల్లో నిర్వహించనున్న పరీక్షలు కూడా ఇదే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుని మృతదేహానికి నివాళులు అర్పించిన మంత్రి సీతక్క



ములుగు, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): ములుగు మండలం జంగాలలపల్లి గ్రామానికి చెందిన తూముల అనిల్ తేదీ:24.02.2026 నాడు రోడ్డు ప్రమాదంలో మరణించగా ఈ రోజు మంత్రి సీతక్క వారి నివాసంలో అనిల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుమారున్ని కోల్పోయిన వారి కుటుంబాన్ని మంత్రి సీతక్క ఓదార్చారు వారి కుటుంబానికి అండగా ఉంటామని దైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రితో ఇంచర్ల సర్పంచ్ ముసినేపల్లి కుమార్ గౌడ్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కునూరు అశోక్ గౌడ్, బంజారుపల్లి సర్పంచ్ కుంచం రఘు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్నాధ చారి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పసికందు ప్రాణం తీసుకున్న రెడ్డిలపై చర్యలు తీసుకోవాలి

**నిరసన తెలియజేసిన పిడిఎస్యు నాయకులు**




హనుమకొండ, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): కుమ్మెర గ్రామంలో జరిగిన కుల వివక్షత దాడిపై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఈరోజు హనుమకొండ కలెక్టర్ ఆఫీస్ ముందు నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత దేశంలో రెండు నెలల పాప ఆమె ఏ కులమో తెలియకుండానే కుల వివక్షతో ప్రాణాలను కోలిపోవడం వంటి దుర్మార్గమైనా మనుధర్మ శాస్త్ర కుల వ్యవస్థ భారతదేశంలో కొనసాగుతుందని దేశంలో నలుమూలలో ఏదో ఒక సందర్భంలో ప్రతిరోజు కుల వివక్షత దాడులు జరుగుతున్నాయని దేశాన్ని పాలిస్తున్నటువంటి ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పూర్తి మొత్తంలో అమలు చేసి కుల వివక్షత దాడులు చేస్తున్నటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఈ అంశంపై ఇంతవరకు ప్రభుత్వం స్పందించకపోగా చనిపోయిన రెండు నెలల పాపపై ఎలాంటి గాయాలు లేవని పోలీస్ మాట్లాడుతూ అగ్రకులానికి తొత్తులుగా వివరించడం సిగ్గుచేటు అన్నారు. ఈ కుల వివక్షత దాడిని మేధావులు బుద్ధి జీవులు ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు వంగేటి మోహన్, సుభాష్ చంద్రబోస్ నాయకులు ప్రణయ్, అధిత్య, వంశీ, రాకేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ధన్ ధాన్య యోజన కార్యక్రమ అమలుపై వీడియో కాన్ఫరెన్స్



జనగామ జిల్లా, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలులో ఉన్న ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన కార్యక్రమ అమలుపై కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ పి. గోట్మారే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జనగాం జిల్లా నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. పింకేష్ కుమార్, జిల్లా కలెక్టరేట్, జనగాం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో రూపొందించిన 6 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతి, మండల స్థాయిలో లక్ష్య సాధన స్థితి, డ్యాష్‌బోర్డ్‌లో నమోదైన పురోగతి వివరాలు, భౌతిక మరియు ఆర్థిక సాధనలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పథకంలో నిర్దేశించుకున్న ప్రధాన లక్ష్యాలు --- పంటల ఉత్పాదకత పెంపొందించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవలంబన, రైతులకు సులభతర ఋణ సదుపాయాలు కల్పించడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, సమగ్ర నీటి యాజమాన్యం, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం --- వంటి అంశాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, మార్కెటింగ్ శాఖ, సహకార విభాగం, భూగర్భ జలాలు, పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ, నాబార్డ్ మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ జనగాం జిల్లాను అమలులో ఆదర్శ జిల్లాగా నిలబెట్టేలా ప్రతి శాఖ సమన్వయంతో, సమగ్ర ప్రణాళికతో మరియు సమయపాలనతో లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

# వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు సన్నద్ధం కావాలి

## వంద శాతం ఫలితాలు సాధించాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమై మంచి ఫలితాలు సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ లోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఏడు, పదో తరగతులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించిన పలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై పాఠ్యాంశానికి సంబంధించిన వివరాలను రాయించారు. ఇంగ్లీషులో రాయడం, చదవడం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షల సమీపిస్తున్నాయని, విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పూర్తిస్థాయిలో సన్నద్ధత కావాలని అన్నారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు బాగా చదవాలన్నారు. విద్యార్థులను చదువుల్లో మరింత ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించి కిచెన్ షెడ్డును పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఏం వండుతున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులకు వంట చేశారని అడిగారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ రాజు, ఎంఈవో మనోజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): వరంగల్లోని ఈఎస్ఐ ఆసుపత్రిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్‌పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా, వైద్య సేవల పరిస్థితిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంటూ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు ఎంపీ వెల్లడించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో ఎంపీ, కలెక్టర్ లు సమావేశమై ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాల లోటుపాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్యుల ఖాళీల భర్తీ, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఈ డాక్టర్ బి. సాంబశివరావు, ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర, ఆర్ ఎం ఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో నియామకాల జోరు




హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అయింది. వైద్య, ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు ఈ నియామకాలకు సంబంధించి అభ్యర్థుల ప్రాథమిక వివరాలను విడుదల చేసింది. ప్రస్తుతం బోర్డు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, అభ్యర్థులు తమ ఫిర్యాదులను ఈనెల 28 వరకు సమర్పించుకోవచ్చు. దరఖాస్తులో దొర్లిన తప్పులు లేదా మెరిట్ లెక్కింపులో వ్యత్యాసాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన వెంటనే, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తుది మెరిట్ జాబితాను బోర్డు సిద్ధం చేయనున్నారు. మెరిట్ జాబితా ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసి, మార్చి చివరి నాటికి నియామక పత్రాలను అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏప్రిల్ మొదటి వారం కల్లా కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను తీర్చడానికి ఈ నియామకాలు అత్యంత కీలకం కానున్నాయి.

# గోదావరి పుష్కరాలకు భద్రత ఏర్పాట్లు

## తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మక కార్యాచరణ

## కుంభమేళా తరహాలో ఫేషియల్ రికగ్నిషన్




హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ బి శివధర్ రెడ్డి తెలిపారు. డీజీపీ కార్యాలయంలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వివిధ జిల్లాల పోలీస్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే సంవత్సరం జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు పకడ్బందీ భద్రత ఏర్పాటు చేయాలని డీజీపీ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి గోదావరి పుష్కరాల సమయంలో ఉమ్మడి జిల్లాలు ఉండేవని, ప్రస్తుతం జిల్లాల సంఖ్య పెరిగిన దృష్ట్యా క్షేత్రస్థాయిలో పనులపై అధికారులు సమగ్ర నివేదికలు తయారు చేయాలన్నారు. మేడారం జాతరలో వినియోగించిన సాంకేతిక నైపుణ్యాన్ని, అనుభవాన్ని ఈ పుష్కరాల్లోనూ సమర్థంగా వాడాలని డీజీపీ సూచించారు. ప్రధానంగా సీసీ కెమెరాలు, ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) వ్యవస్థ, వాహన నంబర్లను గుర్తించే ఏఎన్‌పీఆర్ కెమెరాలు, డ్రోన్ సర్వైలెన్స్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాగ్రాజ్, నాశిక్ కుంభమేళాల తరహాలో వేలాది కెమెరాలతో పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు. గోదావరి నది ప్రవహిస్తున్న నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో అధికారులు పనులను ప్రారంభించాలన్నారు. తాగునీటి నాణ్యత పర్యవేక్షణ, స్మార్ట్ బిన్స్, ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ కలిగిన పారిశుద్ధ్య వాహనాలు తాత్కాలిక సోలార్ గ్రిడ్ వంటివి ఈ పుష్కరాల ప్రత్యేకత కానున్నాయన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల ఏడీజీపీ మహేష్ ఎం భగవత్, ఐజీలు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, గజరావు భూపాల్, ఏఐజి రమణ కుమార్, వివిధ జిల్లాల ఎస్పీలు ,కమిషనర్లు , ఎండోమెంట్ శాఖాధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు.

**అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ ఏర్పాట్లపై డీజీపీ సమీక్ష**

తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమిస్తున్న 74వ 'బి.ఎన్. ముల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2026' ఏర్పాట్లపై డీజీపీ బి. శివధర్ రెడ్డి బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల మార్చి 23 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ క్రీడా సంబరానికి సంబంధించిన ఏర్పాట్లను డీజీపీ పరిశీలించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫుట్బాల్ పోలీస్ క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడనున్నారని డీజీపీ తెలిపారు. క్రీడాకారులకు స్వాగతం పలికేందుకు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లతో పాటు శంషాబాద్ విమానాశ్రయం వద్ద ప్రత్యేక రిసెప్షన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ప్రతి జట్టుకు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఒక లైజన్ ఆఫీసర్‌ను కేటాయించాలని, రవాణా కోసం ప్రత్యేక బస్సులను కేటాయించడం, వారు బస చేసే చోట అవసరాలను కూడా లైజన్ ఆఫీసర్లు చూస్తారని తెలియజేశారు. ఈ మెగా ఈవెంట్ కోసం ప్రత్యేక వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్రచారంతో పాటు లోగో, మాస్కట్, టీ-షర్టులు, మెడల్స్ వంటి బాధ్యతలను ఇమేజిల్ అడ్వర్టైజింగ్ సంస్థకు అప్పగించారు.

# అకాల వర్షాలతో రైతులు అప్రమత్తం

## మార్కెట్ యార్డుల్లో చర్యలకు మంత్రి తుమ్మల ఆదేశం

## పంట సంరక్షణకు ప్రాధాన్యత

## ఉచితంగా టార్పాలిన్ల పంపిణీ



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులందరు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మార్కెట్ యార్డులకు తీసుకొచ్చిన పంట ఉత్పత్తులకు అక్కడే అందుబాటులో ఉన్న టార్పలిన్ కవర్లు అందించినట్టు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో రైతుల ఉత్పత్తులకు నష్టం కలగకుండా సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

**ఉచితంగా టార్పలిన్లు:**

ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల రాకపోకలు అధికంగా కొనసాగుతున్న దృష్ట్యా, ఆకస్మిక వాతావరణ మార్పులు, అధిక తేమ, పురుగు సమస్యలు, అగ్ని ప్రమాదాలు మరియు ఇతర అనుకోని పరిస్థితుల వల్ల మౌలిక సదుపాయాల పరంగా తాత్కాలిక నిల్వ కోసం తగినంత గోదాములు సురక్షిత ప్రదేశాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు తగినంత టార్పాలిన్లు ఉచితంగా అందించాలని సూచించారు. ఉత్పత్తులను నేరుగా నేలపై నిల్వ చేయకుండా చెక్క పలకలు లేదా ఎత్తైన వేదికలను వినియోగించాలని సూచించారు. మార్కెట్ షెడ్లు, గోదాముల పైకప్పులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. వర్షం లేదా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడిన వెంటనే నిల్వలను కవర్డ్ ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రతిరోజు వాతావరణ సూచనలను గమనించి రైతులు, వ్యాపారులకు సమాచారం అందించడంతో పాటు, మాన్సూన్ ఆకస్మిక వర్షాల సమయంలో తక్షణ స్పందన చర్యలు తీసుకునేందుకు టార్పాలిన్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, పీక్ సీజన్‌లో మార్కెట్ సెక్రటరీలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని మంత్రి సూచించారు.

**24 గంటల టీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణ:**

భద్రతా పరంగా రాత్రి సమయంలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, నిల్వల రక్షణ కోసం భద్రతా సిబ్బందిని నియమించాలన్నారు. సాధ్యమైనచోట్ల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల అవగాహన పెంపొందించేందుకు జాగ్రత్త సూచనలను మార్కెట్ యార్డులో స్పష్టంగా ప్రదర్శించాలని, మార్కెట్‌కు తీసుకురావడానికి ముందు ఉత్పత్తులను బాగా ఎండబెట్టడం, శుభ్రపరచడం, గ్రేడింగ్ చేయడంపై అవగాహన కల్పించాలన్నారు. తూకం, లేలం ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# భారతీయ రైల్వేలో సరికొత్త విప్లవం

మొదటి పేజీ తరువాయి

సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైల్ పార్సిల్ యాప్ పేరుతో లాజిస్టిక్ సర్వీస్‌ను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. దక్షిణ మధ్య రైల్వే - హైదరాబాద్ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో రైల్ పార్సిల్ యాప్‌ని డెవలప్ చేసింది. సికింద్రాబాద్ రైల్వేలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ రైల్ పార్సిల్ యాప్‌ని లాంచ్ చేశారు.




**మొదటగా 7 నగరాల్లో**

ఇంటి వద్దనే పార్సిల్ బుకింగ్, డెలివరీ సర్వీసులను అందించే లక్ష్యంతో రైల్ పార్సిల్ యాప్‌ను దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తీసుకువచ్చింది. భారతీయ రైల్వేలో తొలిసారిగా ఈ పైలట్ ప్రాజెక్టును హైదరాబాద్ డివిజన్‌లో అమలు చేయడానికి దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. మొదటగా 7 నగరాల్లో రైల్ పార్సిల్ యాప్ సేవలను ప్రారంభించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, బెంగళూరు, చెన్నైలలో ఈ సర్వీసులని అందుబాటులోకి తెచ్చింది. దక్షిణ మధ్య రైల్వే ఇతర మూడు లాజిస్టిక్ పార్ట్నర్స్‌తో కలిసి డోర్ టు, మిడిల్, మెయిన్ డెలివరీ సర్వీసులకి శ్రీకారం చుట్టింది.

**మీ ఇంటి వద్ద నుంచే ఈ యాప్ సేవలు**

ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడారు. ప్రజలు నేరుగా మీ ఇంటి వద్ద నుంచే 'రైల్ పార్సిల్ యాప్' సేవలని వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ యాప్‌తో అతి సులువుగా, వేగంగా పార్సిల్స్ సేవలని అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. దీంతో పాటు దక్షిణ మధ్య రైల్వేలో ఫ్రైట్ లాజిస్టిక్స్ మార్కెట్‌పై అధ్యయనం చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- బెంగళూరుతో అవగాహన ఒప్పందం చేసుకుందని వివరించారు.

**వన్‌స్టాప్ వేదికగా ఈ యాప్**

రైల్ పార్సిల్ యాప్ ఫస్ట్ మైల్ (పికప్), మిడ్ మైల్ (రైల్వే ద్వారా రవాణా), లాస్ట్ మైల్ (డెలివరీ) సేవలను సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా అనుసంధానించేలా ఈ యాప్ సేవలు ఉంటాయని తెలిపారు. ఇది పార్సిల్ సేవలను సులభతరం చేస్తుందని తెలిపారు. వినియోగదారులు ఇంటి నుంచి పార్సిల్ సరుకులను బుకింగ్ చేయడానికి, ట్రాక్ చేయడానికి వన్‌స్టాప్ వేదికగా ఈ యాప్ ఉపయోగపడుతుందని వెల్లడించారు. పరిశ్రమ, వినియోగదారులు, వ్యాపారాలు, లాజిస్టిక్స్ భాగస్వాములను ఒకే డిజిటల్ పర్యావరణ వ్యవస్థ కిందకు తీసుకురావడానికి ఈ యాప్‌ని రూపొందించామని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ పేర్కొన్నారు.

# తెలంగాణ పల్లెల్లో డిజిటల్ విప్లవం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించాలని టీ-ఫైబర్ సంకల్పించింది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగానూ ఇప్పటికే కేబుల్‌ను అందుబాటులోకి తెచ్చింది. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా టీ-ఫైబర్ అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధం అవుతుంది. అయితే కేంద్రం నుంచి టీ-ఫైబర్‌కు ఓ గుడ్‌న్యూస్ వచ్చింది. వేగవంతమైన ఇంటర్నెట్ సేవలందించేందుకు టీ-ఫైబర్ చేస్తున్న ప్రయత్నానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చింది. భారత ప్రభుత్వం సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద తెలంగాణకు రూ.3,185 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. ఈ నిధులతో భారత్‌నెట్ ఫేజ్-1, ఫేజ్-2 పనులను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు ఫేజ్-3 విస్తరణ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు అమలుకు కేంద్రం, రాష్ట్రం మధ్య ఒప్పందం కుదుర్చు కోవాల్సి ఉన్నది. మరికొద్ది రోజుల్లో కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చి దీనిపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిసింది. దాంతో ఓ రూట్ మ్యాప్ రూపొందించి ఆ తర్వాత కేంద్రం వాటా, రాష్ట్ర వాటాను విభజించి ఒప్పందం చేసుకోనున్నారు. ఆ తదుపరి వెంటనే ఎంవోయూలు కుదుర్చుకోనున్నారు. ఆ తర్వాత కేంద్రం వాటాతో రాష్ట్రం ముందుకెళ్లనుంది.



### ఆ జిల్లాల్లోనూ అమలు

టీ-ఫైబర్ సేవలను ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని 3,089 గ్రామాలకూ విస్తరించనున్నారు. ప్రస్తుతం టీ-ఫైబర్ ద్వారా తెలంగాణలో 9,662 గ్రామాలకు సేవలు అందించే సామర్థ్యం ఉన్నది. కొత్త గ్రామాలు చేరడంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందించే దిశగా తెలంగాణ మరో అడుగు ముందుకేస్తుంది. మొత్తం రూ.3,185 కోట్లలో రూ.2,697 కోట్లు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ కేబుల్ పనులు, నిర్వహణ కోసం వినియోగించనున్నారు.మరో రూ.432 కోట్లు ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో కేబుల్ మౌలిక వసతుల బలోపేతానికి కేటాయించనున్నారు. భారత్‌నెట్ ఫేజ్-2లో ఇప్పటికే టీ-ఫైబర్ ద్వారా సుమారు 42 వేల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్ 9,662 గ్రామాల్లో వేశారు. వీటిలో 8,835 గ్రామాల్లో సేవలు ప్రారంభించేందుకు సాంకేతికంగా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే సేవలు ప్రారంభం కానున్నాయి.

### జనాభా ఆధారంగా కనెక్షన్ కాస్ట్

గ్రామ జనాభా ఆధారంగా ఇంటింటికీ ఇంటర్నెట్ కనెక్షన్ ఖర్చును కూడా నిర్ణయించారు. 3,000 మందికి పైగా జనాభా ఉన్న గ్రామాల్లో ఒక కనెక్షన్‌కు రూ.8,900, 2,000–3,000 మధ్య జనాభా ఉన్న గ్రామాల్లో రూ.10,500, 1,000–2,000 మధ్య జనాభా ఉన్న గ్రామాల్లో రూ.11,500, 1,000 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ.12,900గా నిర్ణయించారు. ఈ ఆమోదం రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా లభించింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంది. మంత్రి శ్రీధర్‌బాబు కేంద్రంతో చర్చలు జరిపి ప్రాజెక్టు ఆమోదం కోసం కృషి చేశారు. ఈ క్రమంలో కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సమావేశమై టీ-ఫైబర్ విస్తరణకు సహకారం కోరారు. ఈ ప్రాజెక్టు అమలుతో గ్రామాల్లో డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, టెలీమెడిసిన్, ఈ-గవర్నెన్స్ మరియు గ్రామీణ వ్యాపార అవకాశాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

### ఉమ్మడి కరీంనగర్‌లో ప్రారంభం?

ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు గ్రామాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా టీ-ఫైబర్ సేవలందిస్తోంది. అయితే కేంద్రంతో ఒప్పందం తర్వాత మొదటగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పూర్తి స్థాయిలో సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. లేదంటే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అమలు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఆ రెండు జిల్లాల్లో పోల్చితే కరీంనగర్‌లోనే సోర్స్ ఎక్కువ అనే అభిప్రాయం అధికారుల్లో వ్యక్తం అయినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇక్కడే ముందుగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

# ఈ పండ్లను రోజూ తింటే మీ గుండె సేఫ్

శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో గుండె ఒకటి. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. కానీ ప్రస్తుత కాలంలో చాలా మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. గుండెపోటు, స్ట్రోక్ ల కారణంగా ప్రాణాలను కోల్పోతున్నారు. కనుక గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యంగా ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లతో నిండిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి పోషకాలన్ని కలిగి ఉన్న ఆహారాల్లో పండ్లు కూడా ఒకటి. పండ్లను తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. గుండె ఆరోగ్యాన్ని సంరక్షించడంలో సహాయపడే పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. బెర్రీలు, యాపిల్ పండ్లు..

గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో బెర్రీ జాతికి చెందిన పండ్లు ఎంతో సహాయపడతాయి. బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, రాస్ప్బెర్రీ వంటి పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఆంథోసైనిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి గుండె ప్రమాదాలను తగ్గించడంలో దోహదపడతాయి. ఈ పండ్లను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. స్మూతీ, పెరుగు, ఓట్ మీల్ వంటి వాటితో ఈ పండ్లను కలిపి తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆపిల్ పండ్లు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది.



కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఈ ఫైబర్ సహాయపడుతుంది. ఆపిల్స్ పాలీఫినాల్స్ ను కూడా కలిగి ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించే ప్రభావాలను కలిగి ఉంటాయి. ఆపిల్ ను తొక్కతో సహా కలిపి తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.

### అవకాడో, నారింజ పండ్లు..

అవకాడోలు మోనోశాచురేటెడ్ కొవ్వులను కలిగి ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో అవసరం. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది. అవకాడోలను తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. హోల్ గ్రెయిన్ టోస్ట్ లతో, సలాడ్స్, స్మూతీ వంటి వాటితో అవకాడోలను కలిపి తీసుకోవచ్చు. నారింజ పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని, రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ధమనుల ధృఢత్వాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. తాజా నారింజ పండ్ల రసాన్ని తీసుకోవడం లేదా నారింజ పండ్లను నేరుగా నమిలి తినడం వంటివి చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

### దానిమ్మ పండ్లు..

ఇక దానిమ్మ పండ్లు కూడా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో దోహదపడతాయి. దానిమ్మ పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ప్యూనికాలాజిన్లు ఉంటాయి. ఇవి ధమనుల్లో అడ్డంకులు ఏర్పడకుండా కాపాడడంలో, రక్తప్రవాహాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. సలాడ్లు లేదా పెరుగు మీద దానిమ్మ గింజలను చల్లి తీసుకోవడం ద్వారా, స్వచ్ఛమైన దానిమ్మ పండ్ల రసాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ఈ విధమైన పండ్లను రోజూ ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.




# పీఎం ఆవాస్ యోజన 2.0 కింద నిధులు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): పట్టణాల్లో ఉన్న పేదలకు పీఎం ఆవాస్ యోజన 2.0 పథకం శుభవార్తను అందించింది. కేంద్ర ప్రభుత్వం పట్టణ పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే లక్ష్యంతో చేపట్టిన పథకం కింద మరో భారీ ముందడుగు వేసింది. తాజాగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో దేశవ్యాప్తంగా కొత్తగా 2.88 లక్షల (2,87,618) ఇళ్ల నిర్మాణానికి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పీఎంఏవై-యూ 2.0 పథకం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు మంజూరైన మొత్తం ఇళ్ల సంఖ్య 13.61 లక్షలకు చేరింది. తాజా విడతలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా మొత్తం 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లబ్ధి చేకూరనుంది. ఈ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం సామాజిక సమతుల్యతకు, మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది. మంజూరైన మొత్తం ఇళ్లలో సింహభాగం అంటే సుమారు 1.60 లక్షల ఇళ్లను మహిళల పేరుతోనే కేటాయించనున్నారు. అలాగే సామాజిక వర్గాల వారీగా చూస్తే ఓబీసీలకు 82,190 ఇళ్లు, ఎస్సీలకు 35,525, ఎస్టీలకు 9,773, సీనియర్ సిటిజన్లకు 22,581 ఇళ్లను కేటాయించారు. ట్రాన్స్‌జెండర్లకు సైతం ప్రత్యేకంగా 8 యూనిట్లు మంజూరు చేయడం విశేషం. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ ఖర్చులో ప్రభుత్వం నుంచి రూ. 2.50 లక్షల వరకు నేరుగా ఆర్థిక సాయం అందనుంది. ఈ పథకాన్ని ప్రధానంగా రెండు విభాగాల్లో అమలు చేస్తున్నారు. లబ్ధిదారులే స్వయంగా తమ స్థలంలో ఇల్లు నిర్మించుకునే బెనిఫిషియరీ లెడ్ కన్స్ట్రక్షన్ పద్ధతితో పాటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించే అఫోర్డబుల్ హౌసింగ్ ఇన్ పార్టనర్‌షిప్ ద్వారా ఈ గృహాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, అల్ప ఆదాయ వర్గాలకు ఈ పథకం ఒక గొప్ప వరమని కేంద్రం పేర్కొంది. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు గృహప్రవేశం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సమన్వయం చేసుకుంటోంది.

### అర్హత ప్రమాణాలు

ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షల నుంచి రూ. 9 లక్షల లోపు ఉండాలి. దేశంలో ఎక్కడా లబ్ధిదారుడికి, వారి కుటుంబ సభ్యులకు సొంత పక్కా ఇల్లు ఉండకూడదు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, సీనియర్ సిటిజన్లకు ఈ పథకంలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తారు. ఇంటి యాజమాన్యం తప్పనిసరిగా మహిళ పేరు మీద- పురుషుడితో కలిపి ఉమ్మడి పేరు మీద ఉండాలి.

### దరఖాస్తు విధానం

పైన తెలిపిన అన్ని అర్హతలు ఉన్న వారు ఆన్‌లైన్‌లో https://pmay-urban.gov.in/ వెబ్‌సైట్ ద్వారా, నేరుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ, బ్యాంకు పాస్‌బుక్ కాపీని సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అర్హులైన వారికి రూ. 2.50 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తారు.

# ఫ్యాటీ లివర్‌తో పరేషాన్

ఫ్యాటీ లివర్.. అంటే కాలేయ కణాల్లో అధికంగా కొవ్వు పేరుకుపోయే సమస్య! ఒకప్పుడు అతిగా మద్యం తాగేవారికి మాత్రమే ఎక్కువగా వచ్చేది. కానీ.. ఇటీవలికాలంలో ఊబకాయం, మధుమేహం, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ (మన శరీరం మనం తిన్న ఆహారాన్ని శక్తిగా మార్చుకునే ప్రక్రియను మెటబాలిజం అంటారు. ఆ ప్రక్రియలో లోపం తలెత్తితే దాన్ని మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అంటారు) వంటి వాటివల్ల ఫ్యాటీలివర్ బారిన పడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా.. రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఈ సమస్యతో బాధపడుతున్నవారి సగటు జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉందని ది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా సీఎస్ఐఆర్ దేశవ్యాప్తంగా 27 పట్టణాల్లో 10 వేల మందిని ఎంపిక చేసి.. వారిలో 7764 మందికి పరీక్షలు చేయించారు. వారిలో 38.9 శాతం మంది 'మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఏఎస్ఎల్‌డీ)' బారిన పడ్డట్టు తేలింది. హైదరాబాద్‌లో ఈ సగటు 40.9 శాతంగా (పురుషుల్లో 46శాతం, మహిళల్లో 36.2శాతం) ఉండగా.. ఢిల్లీలో 41.3శాతం, చెన్నైలో 41.2శాతం, బెంగళూరులో 40.6 శాతంగా ఉన్నట్టు వెల్లడైంది. మెట్రోనగరాలు, పట్టణాల్లోనే కాదు.. అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా గ్రామాల్లో సైతం దీని బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోందని.. మధ్యవయసువారిలో మాత్రమే కాక యువతలో కూడా ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవనశైలి మార్పులు, ఊబకాయం, మధుమేహం కారణంగా ఈ సమస్య వేగంగా పెరుగుతోందని వారు హెచ్చరిస్తున్నారు. అయితే.. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడేవారిలో అది ముదిరేవరకూ ఎలాంటి లక్షణాలూ కనిపించవు! అందుకే వైద్యనిపుణులు దీన్ని సైలెంట్ డిసీజ్‌గా పేర్కొంటున్నారు.

### ఏఐజీ సర్వే..

హైదరాబాద్‌లోని ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆస్పత్రి కూడా ఫ్యాటీ లివర్ విస్తృతిపై సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో పాల్గొన్న మొత్తం 1028 ఐటీ ఉద్యోగుల్లో.. 46 శాతం మందికి ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నట్లు తేలింది. అలాగే.. వారిలో 51 శాతం మంది మధుమేహ బాధితులు, 25% మంది హెపటైటిస్ బాధితులు ఉన్నారని వైద్యులు వివరించారు. మధుమేహ బాధితుల్లో క్యాన్సర్ ముప్పు కూడా ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు. గ్రామాల్లో దాదాపు 5 వేల మందిపై అధ్యయనం చేయగా 38 శాతం ఉన్నట్లు నిర్ధారణఅయ్యింది. ఈ అధ్యయనం ఇంకా కొనసాగుతుంది.

### జీవనశైలే దోషి..

ఇటీవలికాలంలో ప్రజల జీవన శైలి బాగా మారింది. ఆహార పదార్థాల వినియోగంలో మార్పులు చోటు చేసుకున్నాయి. శారీరక శ్రమ చేసేవారి సంఖ్య తగ్గి.. ఊబకాయుల సంఖ్య పెరుగుతోంది. ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు కారణాలేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అయితే దీనిని పెద్దగా ఎవరు పట్టించుకోవడం లేదని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆస్పత్రికి వెళ్తే.. వైద్యపరీక్షల్లో ఫ్యాటీ లివర్ ఉన్న విషయం బయటపడుతోందని వారు పేర్కొన్నారు. ఫ్యాటీ లివర్‌ను నిర్లక్ష్యం చేస్తే.. అది లివర్ సిరోసిసకు (కాలేయం గట్టిపడే సమస్య), చివరకు కాలేయ క్యాన్సర్‌కు దారితీస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. కాలేయ క్యాన్సర్ బాధితుల్లో చాలామందికి ఆ సమస్య ఫ్యాటీ లివర్‌తోనే మొదలవుతోందని తెలిపారు. అంతేకాదు.. ఫ్యాటీ లివర్ ఉన్నవారికి గుండె జబ్బుల ప్రమాదం రెండింతలు ఎక్కువగా ఉంటుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఊబకాయం, మధుమేహం, అధిక కొవ్వు.. ఇవన్నీ కలిసి మెటాబాలిక్ సింద్రోమ్‌కు దారి తీస్తాయని, ఇది కేవలం కాలేయ సమస్యగా చూడకూడదని వైద్యులు వివరిస్తున్నారు. కాబట్టి.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటే ఫ్యాటీ లివర్ సమస్య బారిన పడకుండా ఉండొచ్చని సూచిస్తున్నారు.

### ఫ్యాటీ లివర్ రావడానికి ప్రధాన కారణాలు



శారీరక శ్రమ లేకపోవడం. కదలకుండా ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం.

ప్రాసెస్డ్ ఫాస్ట్ ఫుడ్ వినియోగం

మధుమేహం, రక్తపోటు

అధిక బరువు.. పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం

# నేడు జింబాబ్వేతో మ్యాచ్

**టీం ఇండియా తుది జట్టులో కీలక మార్పులు**

**సంజు శాంసన్ జట్టులోకి వచ్చే అవకాశాలు**

**ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులోకి!**

టీ20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే జింబాబ్వేపై భారీ విజయం టీం ఇండియాకు అనివార్యం. ఈ కీలక మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చోటు చేసుకోనున్నాయి. తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉంది. రింకు వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లడంతో సందిగ్ధత నెలకొంది. టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీం ఇండియా ప్రస్థానం ఉత్కంఠగా మారింది. ప్రతి మ్యాచ్ చావో రేవో అన్నట్లుగా మారడంతో జట్టు సెమీ ఫైనల్ చేరాలంటే కేవలం గెలుపుతో పాటు అదృష్టం కూడా తోడవ్వాలి. ముఖ్యంగా దక్షిణాఫ్రికా చేతులో ఎదురైన 76 పరుగుల ఘోర పరాజయం భారత్ నెట్ రన్ రేట్‌ను మైనస్‌లోకి నెట్టేసింది. ఈ పరిస్థితుల్లో భారత జట్టుకు గండం గట్టెక్కాలంటే జింబాబ్వేపై సాధారణ విజయం సరిపోదు. ఒక భారీ విధ్వంసం సృష్టించి, జింబాబ్వేను చిత్తుగా ఓడించి రన్ రేట్‌ను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే వెస్ట్ ఇండీస్‌తో జరిగే చివరి పోరులో కూడా భారత్‌కు అవకాశం ఉంటుంది. ఈ కీలకమైన డూ ఆర్ డై మ్యాచ్ గురువారం, 26వ తేదీన చెన్నైలోని వేదికగా జింబాబ్వేతో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం టీం ఇండియా తుది జట్టులో మూడు కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మార్పులు జట్టు బలాన్ని పెంచి, విజయావకాశాలను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు. మొదటి మార్పుగా, ఫామ్ లేమితో గత కొంతకాలంగా సతమతమవుతున్న తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంజు శాంసన్ బ్యాటింగ్‌లో స్థిరత్వాన్ని, దూకుడును తీసుకురాగలడని భావిస్తున్నారు. రెండవ మార్పుగా, వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులో చేరవచ్చు. అక్షర్ పటేల్ తన స్పిన్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ కీలక



పరుగులు చేయగలడు. మూడవ, అత్యంత కీలకమైన మార్పు రింకు సింగ్‌కు సంబంధించింది. రింకు సింగ్ కుటుంబ అత్యవసర పరిస్థితుల కారణంగా హుటాహుటిన జట్టును వీడి ఇంటికి వెళ్ళిపోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తండ్రి అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితులు విషమంగా ఉండటంతో అతడు వెంటనే వెళ్ళాల్సి వచ్చిందని సమాచారం. దీంతో గురువారం జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌కు రింకు సింగ్ అందుబాటులో ఉంటాడా లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఫినిషర్‌గా మెరుపులు మెరిపించాల్సిన రింకు ఈ ప్రపంచ కప్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా అతడిని జింబాబ్వేతో మ్యాచ్‌లో ఆడించే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు, మ్యాచ్ జరిగే చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో రింకు స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మొత్తంగా, తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవులతో కూడిన ఈ మూడు మార్పులు జింబాబ్వేతో జరిగే ఈ డూ ఆర్ డై మ్యాచ్‌లో టీం ఇండియాకు కీలకం కానున్నాయి. ఈ మార్పులతో భారత జట్టు సెమీ ఫైనల్ రేసులో నిలబడటానికి పటిష్టంగా సిద్ధమవుతోంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ను జింబాబ్వేతో చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆడనుంది. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటం ప్రత్యర్థి ఆఫ్ స్పిన్నర్లకు వరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగల సంజూ శాంసన్ జట్టులోకి రావడం భారత్‌కు ఎంతో మేలు చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా చెన్నైలో శాంసన్‌కు ఉన్న రికార్డు కూడా అతనికి మద్దతుగా నిలుస్తోంది. అక్షర్ గతంలో క్లిష్ట సమయాల్లో అటు బంతితో, ఇటు బ్యాట్‌తో జట్టును ఆదుకున్నాడని గుర్తు చేశాడు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న కొన్ని ఎంపికలపై ఇప్పటికే విమర్శలు వస్తున్న తరుణంలో, జింబాబ్వేపై గెలవడమే కాకుండా సెమీస్ రేసులో నిలవాలంటే టీమిండియా వ్యూహాత్మకంగా అడుగులు వేయాల్సి ఉంది.

## సెమీస్ రేసు నుంచి శ్రీలంక నిష్క్రమణ

**న్యూజిలాండ్ చేతిలో 61 పరుగుల తేడాతో చిత్తు...**

**20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసిన న్యూజిలాండ్**

**169 పరుగుల లక్ష్యంతో దిగి 107 పరుగులు చేసిన శ్రీలంక**




టీ20 ప్రపంచకప్ సూపర్-8లో శ్రీలంకను న్యూజిలాండ్ చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. 169 పరుగుల లక్ష్యంతో క్రీజులోకి దిగిన శ్రీలంక పూర్తి ఓవర్లు ఆడి 8 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. శ్రీలంక 61 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకున్నది. న్యూజిలాండ్ జట్టులో మిచెల్ సాంట్నర్ దూకుడుగా ఆడి 26 బంతుల్లో 47 పరుగులు చేశాడు. కోలె మెక్‌కాంచి 23 బంతుల్లో 31 పరుగులు, ఫిన్ అలెన్ 13 బంతుల్లో 23 పరుగులు, రచిన్ రవీంద్రా 22 బంతుల్లో 32 పరుగులతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర చెరో మూడు వికెట్లు తీయగా, దునిత్ వెల్లలాగే 1 వికెట్ తీశారు. శ్రీలంక ఆటగాళ్లలో కమిందు మెండిస్ 23 బంతుల్లో 31 పరుగులు, దునిత్ వెల్లలాగే 23 బంతుల్లో 29 పరుగులతో రాణించారు. మిగిలిన ఆటగాళ్లు ఏమాత్రం పరుగులు రాబట్టలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్రా 4, మాట్ హెన్రీ రెండు, పిలిప్స్, సాంట్నర్ ఒక్కో వికెట్ తీశారు. సూపర్-8లో వరుసగా రెండో ఓటమి నేపథ్యంలో శ్రీలంక సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది.

## రోహిత్ రికార్డుపై కన్నేసిన పాండ్యా

భారత సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన తరం అత్యుత్తమ టీ20 క్రికెటర్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్యాట్స్‌మన్‌గా అంతర్జాతీయ టీ20ల్లో 2000కి పైగా పరుగులు సాధించిన పాండ్యా, బౌలర్‌గా కూడా 100కి పైగా వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు ఫీల్డర్‌గా కూడా తన సత్తా చాటుతూ రోహిత్ శర్మ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధమవుతున్నాడు. గత పదేళ్లలో భారత జట్టు చిన్న ఫార్మాట్‌లో అజేయ శక్తిగా ఎదిగింది. ఈ కాలంలో ఆధునిక కాలపు సూపర్‌స్టార్లను భారత క్రికెట్ ప్రపంచానికి పరిచయం చేసింది. ఆ జాబితాలో హార్దిక్ పాండ్యా పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 2016లో ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో హార్దిక్ పాండ్యా భారత్ తరఫున టీ20 ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్ నుంచి టీమిండియాలో కీలక సభ్యుడిగా మారాడు. అయితే గాయాల కారణంగా కొంతకాలం అతని ప్రదర్శనలకు బ్రేక్ పడింది. హార్దిక్ పాండ్యా ఇప్పటివరకు భారత్ తరపున 134 అంతర్జాతీయ ၁20× మ్యాచ్‌లు ఆడాడు. ఇది మూడు ఫార్మాట్లలో అతను ఆడిన అత్యధిక మ్యాచ్‌ల సంఖ్య. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లో కూడా పాండ్యా ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 2024లో టీ20 క్రికెట్‌కు రిటైర్ అయ్యాడు. తన కెరీర్‌లో 159 టీ20ఐ మ్యాచ్‌లు ఆడి మొత్తం 65 క్యాచ్‌లు పట్టుకున్నాడు. ఇది భారత ఆటగాళ్లలో అత్యధిక క్యాచ్‌ల రికార్డు. 30-యార్డ్ సర్కిల్‌లో ఫీల్డింగ్ చేస్తూ సురక్షితమైన చేతుల జోడిగా రోహిత్ పేరుపొందాడు. ముఖ్యంగా యువ దశలో భారత్‌కు అతను వేగవంతమైన ఫీల్డర్‌గా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా 64 క్యాచ్‌లతో రోహిత్ రికార్డును అధిగమించే దశకు చేరుకున్నాడు. ఈ జాబితాలోని చాలా మంది ఆటగాళ్లు భారత క్రికెట్‌కు దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ ప్లేయర్లు. కానీ రింకు సింగ్, తిలక్ వర్మ మాత్రం 2023లోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువకులు. ఇప్పటివరకు 45 మ్యాచ్‌లు ఆడి ఇప్పటికే ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకోవడం వారి అద్భుతమైన ఫీల్డింగ్‌కు నిదర్శనం. ముఖ్యంగా రింకు సింగ్ మైదానంలో 'బాల్ మాగ్నెట్'లా వ్యవహరిస్తూ అనూహ్యమైన క్యాచ్‌లతో అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. ఎంఎస్ ధోనీ ప్రవేశపెట్టిన "ఫీల్డర్లు మ్యాచ్‌లు గెలిపిస్తారు" అనే సిద్ధాంతం తర్వాత భారత్ అత్యుత్తమ ఫీల్డింగ్ స్కిల్స్ ఉన్న ఆటగాళ్లను ఎక్కువగా ప్రోత్సహిస్తోంది. హార్దిక్ పాండ్యా 134 టీ20ఐ మ్యాచ్‌ల్లో 105 సార్లు బ్యాటింగ్ చేసి 2176 పరుగులు చేశాడు. సగటు 27.89 కాగా, స్ట్రైక్




రేట్ సుమారు 144.80గా ఉంది. అతని ఖాతాలో 8 అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 110 వికెట్లు తీసుకున్న పాండ్యా, టీ20ఐల్లో 100కి పైగా వికెట్లు సాధించిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. ఫీల్డింగ్‌లో 64 క్యాచ్‌లు పట్టిన పాండ్యా, గత కొన్ని ఏళ్లలో అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌లతో ప్రేక్షకులను అలరించాడు.

## సచిన్ విషయంలో తప్పు చేశాను


### అంపైర్ స్టీవ్ బక్నర్ కీలక ప్రకటన

క్రికెట్ చరిత్రలో అత్యంత వివాదాస్పద నిర్ణయాలలో ఒకటి మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. అందుకు కారణం సచిన్ విషయంలో తాను తప్పు చేశానని అంపైర్ స్టీవ్ బక్నర్ స్వయంగా అంగీకరించారు. 2003-04 ఆస్ట్రేలియా పర్యటనలో బ్రిస్బేన్ టెస్టులో క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్‌ను స్టీక్ బక్నర్ ఎల్బీడబ్ల్యూ అవుట్‌గా ప్రకటించిన ఘటన అభిమానులకు నేటికీ గుర్తుంది. అయితే 22 ఏళ్ల తర్వాత ఆ మ్యాచ్ అంపైర్ స్టీవ్ బక్నర్ తొలిసారిగా సచిన్ ఎల్బీడబ్ల్యూ నిర్ణయం తప్పని బహిరంగంగా అంగీకరించారు. 79 ఏళ్ల బక్నర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ రోజు బంతి స్టంప్స్‌ను తాకడం లేదని, తాను సచిన్‌ను ఔట్ ఇచ్చి ఉండాల్సింది కాదన్నారు. ఆయన చేసిన ఈ ప్రకటనతో రెండు దశాబ్దాలుగా పలుమార్లు కొనసాగిన చర్చకు తెరపడింది. జీవితంలో కొన్ని తప్పులు జరుగుతాయని, సచిన్ విషయంలో తాను చేసిన తప్పును అంగీకరిస్తున్నానని బక్నర్ స్పష్టం చేశారు. 2003-04లో బ్రిస్బేన్‌లో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జాసన్ గిలెస్పీ వేసిన ఒక బంతిని సచిన్ వదిలేయడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో బంతి సచిన్ ప్యాడ్లకు తగిలింది. ఆస్ట్రేలియా ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేయడంతో అంపైర్ స్టీవ్ బక్నర్ ఆ అప్పీల్‌ను అంగీకరిస్తూ వేలెత్తి సచిన్‌ను ఔట్ అని ప్రకటించారు. ఆ సమయంలో సచిన్ కేవలం 3 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. తరువాత టీవీ రిప్లేలో బంతి స్టంప్స్ పైనుంచి వెళ్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. కామెంటరీ బాక్స్‌లో ఉన్న దిగ్గజ వ్యాఖ్యాత టోనీ గ్రేగ్ కూడా దీనిని చెత్త నిర్ణయంగా పేర్కొన్నారు. ఇది చాలా దారుణమైన నిర్ణయం. నిర్ణయం తీసుకునే ముందు బంతి లైన్, బౌన్స్‌ను అంపైర్ బక్నర్ గమనించి ఉండాల్సింది అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ రోజుల్లో డిఆర్ఎస్ వ్యవస్థ అందుబాటులో లేదు. అందువల్ల అంపైర్ నిర్ణయమే ఫైనల్ అని భావించేవారు. ఈ ఒక్క నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో పెద్ద వివాదాన్ని సృష్టించింది. సచిన్‌కు వ్యతిరేకగా బక్నర్ గతంలో కూడా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని చాలా మంది భారత అభిమానులు నమ్మేవారు. బ్రిస్బేన్ టెస్ట్ లాంటి ఎన్నో ఘటనల్ని టీమిండియా ఫ్యాన్స్ ఎన్నటికీ మరిచిపోరు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ప్రతి పెద్ద మ్యాచ్ సమయంలోనూ సచిన్ కు వ్యతిరేకంగా బక్నర్ ఇచ్చిన నిర్ణయాలపై తరచుగా చర్చ జరిగేది. మరో మ్యాచులో సచిన్ భుజానికి తాకిన బంతిని క్యాచ్ పట్టి ఆసీస్ క్రికెటర్లు అప్పీల్ చేయగా, దాన్ని సైతం బక్నర్ ఔట్‌గా ప్రకటించడం అప్పట్లో మరో వివాదాస్పద నిర్ణయం. బక్నర్ తప్పిదాలతో సచిన్ ఎన్నో సెంచరీలు కోల్పోయారని భారత అభిమానులు గుర్తుచేసుకుంటారు. కొంతకాలం కిందట అంపైర్ స్టీవ్ బక్నర్ గురించి సచిన్‌కు ప్రశ్న ఎదురైంది. సచిన్ తనదైన శైలిలో సరదాగా సమాధానమిచ్చాడు. తాను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు అంపైర్‌కు బాక్సింగ్ గ్లౌజులు తొడిగించాలని, దాంతో ఆయన త్వరగా వేలు ఎత్తలేరని సచిన్ ఫన్నీగా స్పందించాడు. అంపైర్ తప్పిదం చేశాడని తెలిసి సచిన్ ఆశ్చర్యపోతూ క్రీజును వదిలిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

## క్రీడా స్ఫూర్తికే విఘాతం



హుబ్లీ వేదికగా జమ్మూ కశ్మీర్, కర్ణాటక జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ 2025-26 ఫైనల్ మ్యాచ్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఆట రెండో రోజైన ఫిబ్రవరి 25న జమ్మూ కెప్టెన్ పారస్ డోగ్రా అత్యుత్సాహానికి పోయి కర్ణాటక ప్లేయర్ కేవీ అనీష్‌ను తలతో బలంగా కొట్టడం తీవ్రదుమారం రేపింది. టైటిల్ పోరులో ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతున్న సమయంలో జరిగిన ఈ ఘటన క్రీడా స్ఫూర్తికే విఘాతం కలిగించేలా ఉంది. జమ్మూ కాశ్మీర్ ఇన్నింగ్స్ 101వ ఓవర్ వద్ద ఈ వివాదం మొదలైంది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన బంతి పారస్ డోగ్రా బ్యాట్‌కు తగిలి బౌండరీకి వెళ్లింది. ఆ సమయంలో ఫార్వర్డ్ షార్ట్ లెగ్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కేవీ అనీష్‌తో పారస్ డోగ్రాకు మాటల యుద్ధం జరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన డోగ్రా.. అనీష్ దగ్గరికి వెళ్లి తలతో అతడి తలను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఒక్కసారిగా మైదానంలో వాతావరణం వేడెక్కింది. ఈ భౌతిక దాడిని చూసిన కర్ణాటక సీనియర్ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పారస్ డోగ్రా వైపు దూసుకెళ్లాడు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో అంపైర్లు మధ్యలో వచ్చి ప్లేయర్లను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ కూడా డోగ్రాతో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని సూచించాడు. మరోవైపు కర్ణాటక కెప్టెన్ దేవదత్ పడిక్కల్ ఈ విషయంపై అంపైర్లకు అధికారికంగా ఫిర్యాదు చేశాడు. ఓవర్ ముగిసిన తర్వాత డోగ్రా తన తప్పు తెలుసుకుని అనీష్ వద్దకు వెళ్లి క్షమాపణలు చెప్పాడు. అయితే పారస్ డోగ్రా చేసిన పనికి తీవ్రంగా నొచ్చుకున్న అనీష్, ఆ క్షమాపణలను స్వీకరించడానికి నిరాకరించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, డోగ్రాపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఫైనల్ వంటి పెద్ద మ్యాచ్‌లో ఇలాంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వివాదం పక్కన పెడితే.. ఆట పరంగా జమ్మూ కాశ్మీర్ పటిష్ట స్థితిలో ఉంది. ఇప్పటికే ఆ జట్టు 142 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 469 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ శుభమ్ పుండిర్ 121 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేయగా.. వివాదంలో నిలిచిన కెప్టెన్ పారస్ డోగ్రా 69 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ మూడు వికెట్లు తీసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు.



## దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

### తమన్నా భాటియా వెల్లడి

నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.



## విరోష్ ప్రీమియర్ లీగ్ సెలబ్రేషన్స్

ఫిబ్రవరి 26న గురువారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. తాజాగా ఈ తేదీని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం మెహందీ, సంగీత్ సందడిగా జరిగినట్లు తెలుస్తోంది. సంగీత్‌లో విజయ్, రష్మిక కలిసి నటించిన సినిమాల్లోని ఫొటోలు, వీరి ప్రేమకథ ఫ్రేమ్‌లతో డెకరేషన్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను అధికారికంగా షేర్ చేయాలని కోరుతూ అభిమానులు వీరిద్దరినీ ట్యాగ్ చేస్తున్నారు. సంగీత్‌లో భాగంగా ఇరు కుటుంబాలు సరదాగా 'విరోష్ ప్రీమియర్ లీగ్'ను సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. క్రికెట్ బ్యాట్, సిల్వర్ మెడల్‌పై ఫిబ్రవరి 26 అని రాసి ఉండడంతో పెళ్లి తేదీని ఇలా డిఫరెంట్‌గా ప్రకటించారని అభిమానులు సంబరపడుతున్నారు. ఈరోజు హల్దీ వేడుక జరగనుంది. ఉదయ్‌పుర్‌లోని మెమెంటోస్ హోటల్‌లో జరగనున్న వీరి పెళ్లికి ఇండస్ట్రీలోని ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు కూడా హాజరుకానున్నారు. దీంతో ఉదయపుర్ విమానాశ్రయం అతిథులతో కళకళలాడుతోంది. తరుణ్ భాస్కర్, రాహుల్ రవీంద్రన్, ఈషా, శ్రావ్యా వర్మ, ఆషిక రంగనాథ్, అనిల్ అంబానీలతో పాటు మరికొందరు సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు.

## టాలీవుడ్‌లోకి హాలీవుడ్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ

### అన్నపూర్ణలో ప్రారంభించిన దర్శకధీరుడు జక్కన్న

తెలుగు సినీ ఇండస్ట్రీలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కడానికి సిద్ధమైంది. ఇప్పటికే పాన్‌ఇండియా సినిమాలతో దూసుకెళ్తున్న తెలుగు సినీ పరిశ్రమలో టెక్నాలజీపరంగా సరికొత్త అడుగుపడింది. 'అవతార్' సహా ఎన్నో హాలీవుడ్ సినిమాలను మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ తెలుగు మేకర్స్ ఈ సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎంఅండ్ఎం క్యాప్ ల్యాబ్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను అక్కడ తీసినట్లు తెలిపారు. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. గతంలో అన్నపూర్ణ స్టూడియోస్‌లోనే ఏర్పాటు చేసిన 'డాల్బీ సినిమా ప్రాసెస్' సౌకర్యాన్ని రాజమౌళి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియో కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభమైంది. ఈ సందర్భంగా జక్కన్న మాట్లాడుతూ.. అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు వెళ్తున్నారు. అయితే, ఆ అధునాతన సౌకర్యాలు మాత్రం మనకు ఉండటం లేదు. 'బాహుబలి', 'ఈగ' వంటి సినిమాలు తీస్తున్నప్పుడు మనకు గనుక మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సౌకర్య ఉంటే ఇంకా ఉత్తమంగా ఎలా చేయొచ్చా? అనుకునేవాడిని. ఇప్పుడు ఇది మనకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ ఫిల్మ్‌మేకర్స్ ఆలోచనాధోరణి అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియోలను నేను సందర్శించా. ఏ అండ్ ఎం అద్భుతంగా టెక్నాలజీని అందిస్తోంది. ఇప్పటికే 'వారణాసి' కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని కీలక సన్నివేశాలను తీశా. అవి అద్భుతంగా వచ్చాయని రాజమౌళి అన్నారు. భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక మైలురాయి అని కథానాయకుడు నాగార్జున అభివర్ణించారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.





## ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.

## తమిళ మూవీలో వైష్ణవి చైతన్య

తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య . ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463